క్లుప్తంగా

కురంగేశ్వరుని కల్యాణోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీ అమ్మవారు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పాతకోరంగిలో ఉన్న బాలా త్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ శ్రీరాములు పర్యవేక్షణలో అర్చకులు కొత్తలంక రామకృష్ణ సాయిప్రసాద్ నేతృత్వంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు.

వాసవీ మాతకు లక్ష మల్లెల పూజ


లక్ష మల్లెల పూజ నిర్వహిస్తున్న అర్చకులు

అమలాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి లక్ష మల్లె పూజ సోమవారం వైభవంగా జరిగింది. తొలుత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీ సేవతో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆర్య వైశ్య మహిళలచే అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. పట్టణ వైశ్య సంఘం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, కో చైర్మన్లు నూల రమేష్, పచ్చిగోళ్ల సోమరాజు, వరదా సూరిబాబు, నంబూరి మూర్తి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు జట్టు ఎంపిక


ఎంపికైన జట్టు సభ్యులు

ముమ్మిడివరం: తెనాలిలో జరగబోయే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణపద్మరాజు సమక్షంలో సెలక్షన్ సభ్యులు వాసం శెట్టి నరేష్, గణేష్ తదితరులు జట్టును ఎంపిక చేశారు. ఇటీవల విశాఖలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 25 మందితో జట్టును ఎంపిక చేశారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు సన్మానం


ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సన్మానిస్తున్న క్రైస్తవులు

అల్లవరం: కోడూరుపాడు పంచాయతీ పరిధిలోని సీతారామపేటలోని మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో జీడీఎం పాస్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌కు సోమవారం సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు దుశ్శాలువాలు వేసి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు సియోను రాజు, కె.జాన్, ఉప సర్పంచ్ ముమ్మిడివరపు సుధీర్, యార్లగడ్డ సుబ్రహ్మణ్యం, పెదపూడి వెంకటరమణ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ప్రచార భేరీ యాత్రల ముగింపు


ప్రచార భేరీ ముగింపు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: ప్రధాని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం, సీపీఐలు చేపట్టిన ప్రచార భేరీ యాత్రలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఏర్పాటు చేసిన ముగింపు సభలో సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్, సీపీఐ రాష్ట్ర నాయకుడు డేగా ప్రభాకర్, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ దిగ్గజాలకు మేలు చేసేలా అనేక సంస్కరణలు చేస్తుందని ఆరోపించారు.

చివరిలో కలవరం


భీమనపల్లిలో వర్షాలకు తడిసిన ధాన్యం బస్తాలను తరలిస్తున్న రైతులు


తాళ్లరేవులో మాసూలు చేసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

- అకాల వర్షాలతో ఆందోళనలో అన్నదాతలు
- పంటను కాపాడుకునేందుకు అగచాట్లు

తాళ్లరేవు: అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. ఈ ఏడాది పంటలు బాగా పండడంతో సంతోషించిన కర్షకులకు అకాల వర్షాలతో నిరాశే ఎదురవుతోంది. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాల కారణంగా పంటను ఒబ్బిడి చేసుకునేందుకు, కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరో మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించడంతో అన్నదాతల్లో మరింత భయం నెలకొంది. గత వారం రోజులుగా ఎండలు బాగా కాయడంతో చాలా మంది రైతులు మాసూళ్లు చేపట్టారు. కొన్నిచోట్ల కూలీలతో వరి కోతలు చేపట్టగా, మరి కొన్ని ప్రాంతాల్లో రైతులు యంత్రాల ద్వారా మాసూళ్లు చేస్తున్నారు. అకాల వర్షానికి వరి చేలు పడిపోవడంతో పాటు వరి పనలు తడిసి ముద్దవుతున్నాయని, ఎడతెరిపి లేకుండా వర్షాలు ఇలాగే కురిస్తే మొలకలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 50 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. అధిక శాతం మంది వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేస్తున్నారు. కోసిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉండడంతో దానిని తగ్గించేందుకు రహదారులపై ధాన్యాన్ని అష్టకష్టాలు పడి ఆరబెడుతున్నారు. మాసూలు చేసిన ధాన్యం తడిచిపోకుండా ధాన్యం రాశులపై భారీ టార్పాలిన్‌లు వేసి భద్రత కల్పిస్తున్నారు. ఈ సమయంలో భారీ వర్షాలు పడుతుండడంతో అవి ముక్కిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

మరికొన్ని రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు మరికొన్ని రోజుల పాటు కోతలను వాయిదా వేసుకోవాలని తాళ్లరేవు మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతి కోరారు. ఇప్పటికే కోసి పనపై ఉంటే వాటిని వెనక్కి తిప్పుకుని ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. అలాగే వరిచేలలో పిల్లకాలువలను ఏర్పాటు చేసి ఎప్పటినీరు అప్పుడు దిగిపోయేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే మాసూలు చేసిన ధాన్యాన్ని ఆర్బీకే కేంద్రాల ద్వారా విక్రయించాలనుకునే రైతులు ఆఫ్‌లైన్ ద్వారా కూడా విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ, ఆర్బీకే సిబ్బంది ద్వారా ఎంత మాసూలు జరిగింది అనే విషయాలను అంచనా వేస్తారన్నారు. అలా సేకరించిన ధాన్యాన్ని రైసుమిల్లుల్లో భద్రపరిచేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఘనంగా బాల వికాస కేంద్రాల వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి

అమలాపురం టౌన్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల వికాస కేంద్రాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జరిగాయి. ఈ వేడుకలకు అతిథిగా హాజరైన ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి తొలుత సరస్వతిదేవి, లక్ష్మీదేవి చిత్రపటాలకు పూజలు చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల వికాస కేంద్రాల్లో ఆధ్యాత్మిక భావాలతో పాటు పలు సంప్రదాయ కళలపై శిక్షణ, అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధులు గొలకోటి వెంకటరెడ్డి, పరబ్రహ్మ నందగిరి మాతాజీ, బండ్ల శ్రీరామ శంకర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

యానాంలో కుంభవృష్టి

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఆర్‌ఏఓ మునిస్వామి


ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ గోయల్


చెరువును తలపిస్తున్న బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రీడా మైదానం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పలు పల్లపు ప్రాంతాలు, పట్టణంలోని అనేక వీధులు ముంపుకు గురవడంతో వాహనచోదకులు, పాదచారులు, స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పలు డ్రెయిన్‌లు పొంగిపొర్లడంతో స్థానిక పిల్లారాయవీధి, సుబ్రహ్మణ్యభారతి వీధి, యానాం జూనియర్ కళాశాల ప్రాంగణం, జిక్రియానగర్, దోబీవీధి, బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో మోకాలు లోతున వర్షం నీరు చేరింది. భారీ వర్షం కురుస్తున్నా ఆర్‌ఏఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజగోయల్, డీటీ గణేషన్, మున్సిపల్ ఏఓ మేడిశెట్టి రామలింగేశ్వరావులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా పిల్లారాయవీధిలో నీరు నిలిచిపోవడంతో కొంతసేపు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. స్థానిక పిల్లారాయ స్వామి ఆలయంలోకి భారీగా వర్షం నీరు వెళ్లడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. డ్రెయిన్‌లు మూతపడ్డ పలు ప్రాంతాలను వారు పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి సూచనలిచ్చారు. హెచ్ఆర్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది కలిసి పిల్లారాయవీధి, బ్యాంక్ వీధి, హైవే పరిధి ప్రాంతాల్లో డ్రెయిన్లలో చెత్తను తొలగించడంతో నీరు క్రమేణా శివారుకు వెళ్లింది.

ఐకమత్యంతో సంపూర్ణ ఆరోగ్యం


ఆత్మీయ సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రవీంద్ర తదితరులు

అమలాపురం టౌన్: నడకతోనే కాదు.. ఐకమత్యంతోను సంపూర్ణ ఆరోగ్యం సాకారమవుతుందని వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్పీ రవీంద్ర అన్నారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఆత్మీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. సదస్సులో తొలుత వాకర్స్ ఆద్యుడు అశ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ రవీంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. దుబాయ్‌లో జరిగిన పోటీల్లో విజయకేతనం ఎగురవేసిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ తల్లిదండ్రుల్ని డాక్టర్ రవీంద్ర సత్కరించారు. వాకర్స్ క్లబ్ కార్యదర్శి, నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ఏర్పాటు చేసిన కరోనా నాణేల ప్రదర్శనను వాకర్స్ కుటుంబ సభ్యులు ఆసక్తిగా తిలకించారు. సదస్సులో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పుత్సా రాజేశ్వరి, వాకర్స్ జిల్లా గవర్నర్ ఎం.భాస్కరరావు, రీజనల్ కౌన్సిలర్ ఎస్.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

యానాం: కేంద్ర ప్రభుత్వ నిధులతో యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల్లోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు పుదుచ్చేరి సీఎం రంగసామి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరి ప్రశాంతమైన, అందమైన టూరిస్ట్ ప్రదేశమన్నారు. యానాం, మాహే ప్రాంతాల్లో ఆకర్షణీయమైన టూరిస్ట్ కేంద్రాలున్నాయని చెప్పారు.

తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు

అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు


అనాతవరంలో తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా


కోడూరుపాడులో వర్షానికి తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతరాయుడు

ముమ్మిడివరం: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. ముమ్మిడివరం మండలం అనాతవరంలో సోమవారం ఆయన భారీ వర్షాలకు తడిసిన ధాన్యం రాశులను పరిశీలించారు. అధిక వర్షాలు పడే సూచనలు ఉన్నందున రైతులు తాత్కాలికంగా వరి కోతలు నిలిపివేయాలని సూచించారు. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలులో పౌర సరఫరాల అధికారులు, మిల్లర్లు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. రైతులు ధాన్యం భద్రపరచుకునేందుకు వీలుగా బరకాలు అందించడంతో పాటు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోను క్షేత్ర స్థాయి సిబ్బంది సహకరించాలని ఆదేశించారు. వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. రైతుల అవసరాల మేరకు తడిసిన ధాన్యం మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉప్పు ద్రావణాన్ని వ్యవసాయాధికారుల సూచనల మేరకు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.షంషి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుధాసాగర్, తహసీల్దార్ యడ్ల రాంబాబు, ఏఓ ప్రశాంత్‌కుమార్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

అల్లవరం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఆర్డీఓ వసంతరాయుడు చెప్పారు. సోమవారం కోడూరుపాడులో వర్షానికి తడిసిన ధాన్యపు రాశులను వ్యవసాయాధికారితో కలిసి పరిశీలించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, , బరకాలతో ధాన్యపు రాశుల్ని కప్పుకోవాలని సూచించారు. వర్షం తగ్గిన తర్వాత ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తామని ఆర్డీఓ తెలిపారు. మండలవ్యాప్తంగా సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి వందలాది ఎకరాల్లోని వరి పనలు, ధాన్యం రాశులు, కుప్పలు తడిసి ముద్దయ్యాయి. దేవగుప్తం, డి.రావులపాలెం ఎంట్రుకోన, రెల్లుగడ్డ తదితర గ్రామాల్లోని వరిక్షేత్రాలను ఎంపీడీఓ జి.సరోవరరావు పరిశీలించారు. కొమరగిరిపట్నం, తుమ్మలపల్లి, మొగళ్లమూరు, బెండమూర్లంక గ్రామాల్లోని వరి క్షేత్రాలను తహసీల్దార్ సాంబశివ ప్రసాద్ పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు.

కాట్రేనికోన: అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట క్షేత్రాలను, తడిసిన ధాన్యం రాశులను మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధక శాఖ జేడీ ఎ.జయపాల్, తహసీల్దార్, ఎంపీడీఓ, మండల వ్యవసాయశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు.

ఉప్పలగుప్తం: భారీ వర్షాల కారణంగా అన్నదాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించేందుకు ఏడీఏ ఎంఏ షంషి, ఎంపీడీవో కేఏస్ గౌరీకుమారి, ఏవో జి.కుమార్‌బాబు, డీటీ జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం మండల వ్యాప్తంగా పొలాల్లో పర్యటించి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడి, నల్లమిల్లి, చిందాడగరువు, తాండపల్లి, వన్నెచింతలపూడి, భట్నవెల్లి, కామనగరువులో గ్రామాల్లో సోమవారం కురిసిన భారీ వర్షాలకు వరి పనలు, ధాన్యం రాశులు తడిసిపోవడంతో రైతులు నష్టపోయారు.

వానొచ్చినా.. పింఛన్లు ఆగలేదు

- భారీ వర్షంలోనూ పింఛన్ల పంపిణీ
- నిబద్ధత చాటిన వలంటీర్లు


బోడసకుర్రులో దివ్యాంగురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ హేమ


చినబొడ్డు వెంకటాయపాలెంలో వర్షంలోనే పింఛన్ అందజేస్తున్న వలంటీర్

అల్లవరం: అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో గత కొద్దిరోజులుగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేకచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలుతున్నాయి. అయినా సరే ప్రతి నెలా ఒకటో తేదీన పండగలా నిర్వహించే పింఛన్ల పంపిణీ మాత్రం ఎక్కడా ఆగలేదు. సోమవారం కురిసిన జోరువానను సైతం లెక్క చేయకుండా ఎక్కడికక్కడ పింఛన్లను పంపిణీ చేసి వలంటీర్లు తమ నిబద్ధత చాటుకున్నారు. వాతావరణం అనుకూలించకపోయినా ఒకటో తేదీనే పింఛన్ సొమ్ము ఇంటికొచ్చి చేరడంతో లబ్ధిదారులు సంతోషం వెలిబుచ్చారు. అల్లవరం మండలం వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ యజ్ఞంలా సాగింది. జోరు వానలో పింఛన్ల పంపిణీ చేసిన వలంటీర్లను ఎక్కడికక్కడ లబ్ధిదారులు అభినందించారు.

జోరు వానలోను 70 శాతం పూర్తి

తాళ్లరేవు: సోమవారం భారీ వర్షం కురుస్తున్నా సరే అవ్వ తాతలు, దివ్యాంగులు, వితంతువులకు ఆర్థిక భరోసా అందించే పింఛన్లు ఆలస్యం చేయకూడదని వలంటీర్లు భారీ వర్షంలో గొడుగులు చేతబట్టి పింఛన్లు అందించారు. తాళ్లరేవు మండలం చినబొడ్డు వెంకటాయపాలెంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా స్థానిక వార్డు సభ్యులు, వలంటీర్ పింఛన్లను పంపిణీ చేయడంతో పలువురు స్థానికులు వారిని అభినందించారు. మండలంలో సోమవారం ఒక్క రోజే 11,351 మంది పింఛనుదారులకు గాను 7,915 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. సోమవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పింఛన్‌ల పంపిణీ ప్రారంభించారని తొలిరోజు 70 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందన్నారు.

దివ్యాంగులకు త్రి మోపెడ్‌లు ఇవ్వాలి

యానాం: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా దివ్యాంగులకు త్రీ వీలర్ మోపెడ్‌లను ఇవ్వాలని సోమవారం పలువురు దివ్యాంగులు స్థానిక సాంఘిక సంక్షేమాధికారి రెయ్యా శ్రీనివాస్‌ను కోరారు. ఇప్పటికే పుదుచ్చేరిలో దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్‌సైకిల్స్‌ను ఇటీవల మంత్రి చంద్రప్రియాంక పంపిణీ చేశారని, యానాంలో మాత్రం ఇప్పటివరకూ మొదలు పెట్టలేదన్నారు. దీనికి స్పందించిన సాంఘిక సంక్షేమాధికారి రెయ్యా శ్రీనివాస్ మాట్లాడుతూ మూడుచక్రాల మోటార్ సైకిల్స్ పంపిణీపై పుదుచ్చేరి అధికారులతో మాట్లాడతానన్నారు.

మార్గదర్శిలో కొనసాగుతున్న సీఐడీ సోదాలు

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచిలో సీఐడీ సోదాలు సోమవారం కూడా కొనసాగాయి. ఎనిమిది మంది సీఐడీ అధికారులు నాలుగు రోజులుగా ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. డిపాజిటర్ల సమగ్ర సమాచారం సేకరిస్తూ కూపీ లాగుతున్నారు. మాన్యువల్ రికార్డులే కాకుండా కంప్యూటర్‌లో నిక్షిప్తమైన ఆన్‌లైన్ లావాదేవీలపై కూడా సోదాలు చేస్తున్నారు. ఈ బ్రాంచిలోకి ఖాతాదారులను, డిపాజిటర్లను నాలుగు రోజులుగా అనుమతించడం లేదు. సీఐడీ అధికారులు అడిగే ప్రశ్నలకు సిబ్బంది అరకొర సమాధానాలు చెబుతున్నారు. ఈ సోదాలు మంగళవారం కూడా కొనసాగనున్నాయి. ఈ సోదాల్లో డిపాజిట్ల పరంగా పలు అక్రమాలు జరిగాయని అధికారులు గుర్తించినట్టు తెలిసింది.

ఘనంగా మేడే వేడుకలు

కదిలి వచ్చిన కార్మిక లోకం


అమలాపురంలో జరిగిన మేడే వేడుకల్లో జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాపరావు



తాళ్లరేవులో మేడే ర్యాలీ చేస్తున్న కార్మికులు

అమలాపురం టౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేని సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ ఎర్ర జెండాలను రెపరెపలాడిస్తూ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించారు. వామపక్షాలు, పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అమలాపురంలో జరిగిన మేడే వేడుకలకు జిల్లా రవాణా శాఖాధికారి డి.అశోక్ ప్రతాపరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మికుల శ్రమ శక్తితోనే నేడు సమాజం ముందుకు నడుస్తోందన్నారు. స్థానిక సీతాపతిరావు పేట ఏటిగట్టు ప్రాంతంలో ది కోనసీమ డీజిల్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి.

ముమ్మిడివరం: నగర పంచాయతీ కార్యాలయం వద్ద వివిధ కార్మిక, కర్షక సంఘాల నాయకులు, అంగన్‌వాడీ, భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో పెట్టా శివ జెండా ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. తొలుత కార్మికులు ముమ్మిడివరంలో మేడే ర్యాలీ నిర్వహించారు.

అమలాపురం రూరల్: మేడే సందర్భంగా కిమ్స్ హాస్పటల్‌లో స్థానిక అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నాగలక్ష్మి, లేబర్ ఆఫీసర్ మహేష్‌లు కార్మిక హక్కులపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. సదస్సులో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నాగలక్ష్మి కార్మిక శాఖ పనితీరు, కార్మికుల హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాల ద్వారా అందుతున్న సేవల్ని వివరించారు. లేబర్ ఆఫీసర్ మహేష్ మాట్లాడుతూ ఈ-శ్రమ్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొనే విధానం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.

తాళ్లరేవు: మేడేను పురస్కరించుకుని తాళ్లరేవులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సంతపేట సెంటర్‌లో కార్మిక నాయకులు జెండా ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి సంతపేట సెంటర్ వరకు ర్యాలీ చేశారు. తొలి పార్లమెంట్ ప్రతిపక్షనేత దివంగత పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఐ.పోలవరం: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు.

యానాం: మేడే సందర్భంగా స్థానిక గాయత్రి రైస్ మిల్లు వద్ద కార్మిక జెండాను సీనియర్ నాయకుడు దాసరి రాజు ఆవిష్కరించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి పాతబస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ట్రావెల్ బస్సు బోల్తా

ప్రయాణికులు సురక్షితం

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం బొండాయికోడు వద్ద 216 జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. అమలాపురం నుంచి మురమళ్ల వైపు వెళుతున్న ఓ బస్సు ఎదురుగా రొయ్యల లోడుతో వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి యానాం వస్తున్న మరో ప్రైవేట్ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బస్సు అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న పంట బోదెలోకి బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తూ బస్సులో ఉన్న 10 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ముమ్మిడివరం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని బోల్తా పడ్డ బస్సును బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపారు.

ఇస్రో శిక్షణకు నవోదయ విద్యార్థిని ఎంపిక


ఇస్రో శిక్షణకు ఎంపికైన నాగసూరి జ్ఞానశ్రీ

యానాం: ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) ద్వారా విద్యార్థులకు అంతరిక్ష టెక్నాలజీ గురించి అవగాహన కల్పించే శిక్షణకు యానాం మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయ పదో తరగతి విద్యార్థిని నాగసూరి జ్ఞానశ్రీ ఎంపికైందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. యువవిజ్ఞాని కేంద్రం ద్వారా మే 15 నుంచి 26 వరకూ స్పేస్ టెక్నాలజీ గురించి విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో దేశవ్యాప్తంగా 350 మంది ఎంపికయ్యారన్నారు. నాగసూరి జ్ఞానశ్రీ విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ తిరువనంతపురంకు ఎంపికకావడం గర్వకారణంగా ఉందన్నారు. జ్ఞానశ్రీకి ఉచిత ప్రయాణ, భోజన వసతి, కోర్సు సామగ్రితో పాటు ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తలతో 15 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.